

విద్యుత్ కోతల్లేవ్

జిల్లాలో రోజురోజుకూ విద్యుత్ వినియోగం పెరుగుతోంది. డిమాండ్ పెరిగినా కోతల్లేకుండా విద్యుత్ సరఫరా చేస్తున్నారు.

8లో



బంగారం ధరలు

24 క్యారెట్లు (10గ్రాములు)	రూ.62,340
22 క్యారెట్ల ఆర్నమెంట్ (1 గ్రా)	రూ.5,568
3 శాతం జీఎస్టీతో	రూ.5,735
సవర (8 గ్రా)	రూ.45,880

గరిష్టం/కనిష్టం
40.2 /27.0

వాతావరణం

ఆదివారం గాలిలో 42 శాతం తేమ ఉంది. వాతావరణంలో ఎలాంటి మార్పులు ఉండవు. సోమవారం అధిక ఉష్ణోగ్రతలు కొనసాగుతాయి.



డ్రైవింగ్ వస్తేనే లైసెన్స్



డ్రైవింగ్ ట్రాక్‌ను పరిశీలిస్తున్న కమిషనర్ చందర్, ఆర్టీఓ, ఎంవీఐ

రవాణా శాఖ కార్యాలయంలో లైసెన్స్ తీసుకోవడం చాలా సులువు. అందుకు డ్రైవింగ్ రావాల్సిన పని లేదు. అధికారులకు తెలిసిన వారి ద్వారానో లేక డబ్బులిచ్చి మధ్యవర్తులతో వెళ్తే వాహనం నడిపాల్సిన అవసరం ఉండదు. ఈ పరిస్థితికి త్వరలో చెక్ పడనుంది. నెల్లూరులో ఆటోమేటెడ్ డ్రైవింగ్ టెస్టింగ్ ట్రాక్ నిర్మాణం జరుగుతోంది. ఇది అందుబాటులోకి వస్తే మానవ ప్రమేయం లేకుండా పారదర్శకంగా డ్రైవింగ్ విధానాన్ని వీడియో కెమెరాలు, సెన్సార్ల ద్వారా తనిఖీ చేసి సర్టిఫికెట్లను అందజేయనున్నారు.

నెల్లూరులో ఆటోమేటెడ్ డ్రైవింగ్ టెస్టింగ్ ట్రాక్ నిర్మాణం

- చకచకా జరుగుతున్న పనులు
- కార్యాలయానికి చేరుకున్న వీడియో కెమెరాలు, సెన్సార్లు
- మరో రెండు నెలల్లో అందుబాటులోకి ట్రాక్
- సిఫార్సులకు చెల్లు చీటీ

నెల్లూరు(టౌన్): రవాణా శాఖలో కొత్త మార్పులు వస్తున్నాయి. ఇప్పటికే ఆ శాఖలో 70కు పైగా సేవలు ఆన్‌లైన్ ద్వారా అందుతున్నాయి. త్వరలో ఆటోమేటెడ్ డ్రైవింగ్ టెస్టింగ్ ట్రాక్ అందుబాటులోకి తీసుకొచ్చేందుకు పనులు ప్రారంభించారు. ఇప్పటి వరకు డ్రైవింగ్ టెస్టులు మొక్కుబడిగా సాగుతున్నాయన్న ఆరోపణలకు ఆ శాఖ ఉన్నతాధికారులు చెక్ పెట్టనున్నారు.

రూ.1.23 కోట్ల మంజూరు

కొత్త డ్రైవింగ్ ట్రాక్ కోసం రాష్ట్ర ప్రభుత్వం రూ.1.23 కోట్ల నిధులు మంజూరు చేసింది. సీసీ కెమెరాలు, సెన్సార్లు, కంప్యూటర్లు తదితర వాటికి మొత్తం రూ.కోటి ఖర్చు చేస్తున్నారు. ప్రస్తుతం ఉన్న ట్రాక్‌ను చదును చేసేందుకు, ఎత్తు పెంచేందుకు మరో రూ.23 లక్షలతో పనులను రోడ్లు, భవనాల శాఖ అధికారులకు పనులు అప్పగించారు. ద్విచక్ర, లైట్ మోటార్ వాహనాలు, హెవీ వెహికల్స్ డ్రైవింగ్ చేసే విధంగా డ్రైవింగ్ ట్రాక్‌ను సిద్ధం చేస్తున్నారు. ట్రాక్‌లో 8, హెచ్, అప్‌గ్రేడ్‌మెంట్, పార్లర్ పార్కింగ్ తదితర వాటి ఆకారాల్లో నిర్మాణాలు చేపట్టనున్నారు. ఇది మరో రెండు నెలల్లో అందుబాటులోకి రానున్నట్లు జిల్లా రవాణా శాఖ అధికారులు చెబుతున్నారు.



ట్రాక్‌కు సంబంధించిన వీడియో కెమెరాలు, సెన్సార్లు, కంప్యూటర్లు

ఇలా కుదరదిక

డ్రైవింగ్ లైసెన్స్ కోసం వెళ్లిన సమయంలో మధ్యవర్తుల ద్వారా డబ్బులు ఇచ్చి, లేదా సిఫార్సుల ద్వారా టెస్ట్‌లో ఓకే చేయించుకుని లైసెన్స్‌ను అందుకుంటున్న పరిస్థితి ప్రస్తుతం ఉంది. అయితే కొత్త విధానంతో వీటికి చెక్ పడుతుంది. పక్కాగా ట్రాక్‌లో ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తేనే లైసెన్స్ ఓకే అవుతుంది. ప్రధానంగా డ్రైవింగ్ సమయంలో బ్యాలెన్స్ చేయకపోవడం, ఓవర్ స్పీడ్, ర్యాష్ డ్రైవింగ్, మలుపుల సమయంలో ఇండికేటర్లు సక్రమంగా వినియోగించకపోవడం, సమయానికి హారన్ మోగించకుండా ఎప్పుడంటే అప్పుడు మోగించడం, ఓవర్‌టేక్, సిగ్నల్స్ పాటించకపోవడం తదితర నిబంధనలను అతిక్రమిస్తే డ్రైవింగ్ లైసెన్స్ రాదు. పక్కాగా డ్రైవింగ్ వచ్చిన వారికే లైసెన్స్ వస్తుంది. ఈ నేపథ్యంలో ప్రతి వాహనదారుడు డ్రైవింగ్ టెస్టింగ్‌కు వచ్చే సమయంలో నిబంధనలు క్షుణ్ణంగా తెలుసుకుని రావాలని రవాణా అధికారులు చెబుతున్నారు.

డ్రైవింగ్ పరిశీలన

నెల్లూరులోని జిల్లా రవాణా శాఖ కార్యాలయం పక్కన 2010 సంవత్సరంలో మాన్యువల్ డ్రైవింగ్ ట్రాక్‌ను ఏర్పాటు చేశారు. మొత్తం ఎకరా భూమిలో దీనిని నిర్మించారు. ద్విచక్ర, నాలుగు చక్రాల వాహనాలకు సంబంధించి డ్రైవింగ్‌ను అధికారులు పరీక్షించి సర్టిఫికెట్లను అందజేస్తున్నారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి సరికొత్తగా డ్రైవింగ్‌ను పరిశీలించి తనిఖీ చేసి సర్టిఫికెట్ అందజేసేందుకు ఆటోమేటెడ్ డ్రైవింగ్ టెస్టింగ్ ట్రాక్‌ను తీసుకొస్తున్నారు. ఇప్పటికే ఈ విధానం చిత్తూరు, అనంతపురం జిల్లాల్లో ఉంది. కొత్త ట్రాక్‌లో ప్రతి పది అడుగులకు ఒక సెన్సార్ ఉంటుంది. ట్రాక్‌లో పోల్స్‌ను ఉంచి వాటికి 12 సీసీ కెమెరాలను ఏర్పాటు చేస్తారు. డ్రైవింగ్ చేసే కారులో ఒక కెమెరాను బిగించనున్నారు. వీటితోపాటు రేడియో ఫ్రీక్వెన్సీ, నాయిస్ ఐడెంటిఫికేషన్ సెన్సార్లను ఏర్పాటు చేయనున్నారు. మొత్తాన్ని 15 కంప్యూటర్లకు అనుసంధానం చేస్తారు. లైసెన్స్ దరఖాస్తుదారులు డ్రైవింగ్ చేసే విధానాన్ని వీడియో కెమెరాలు క్యాప్చర్ చేస్తాయి. దీనిని కంట్రోల్ రూం నుంచి రవాణా అధికారులు పర్యవేక్షిస్తారు. కాగా డ్రైవింగ్ చేసే సమయంలో సక్రమంగా నిబంధనలు పాటించకుంటే ఆటోమేటిక్‌గా ఫెయిల్ అయినట్లు మెసేజ్ వస్తుంది. అన్ని నిబంధనలు సక్రమంగా పాటిస్తేనే పాస్ అని మెసేజ్ వస్తుంది. రోజుకు వంద మంది వరకు లైసెన్స్‌లు పొందే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు.

నిబంధనలు తెలుసుకుంటారు

ఆన్‌లైన్ డ్రైవింగ్ టెస్ట్ విధానంలో ఎలాంటి తప్పులు చేయకుంటేనే లైసెన్స్ వస్తుంది. దీని ద్వారా పారదర్శకత ఉంటుంది. వాహనదారులు పూర్తిస్థాయిలో ట్రాఫిక్ నిబంధనలు తెలుసుకుంటారు. డ్రైవింగ్ బాగా చేసినప్పుడు ప్రమాదాల సంఖ్య కూడా బాగా తగ్గుతుంది.

– బి.చందర్, ఉప రవాణా కమిషనర్



చిత్తూరు జిల్లాలోని ఆటోమేటెడ్ డ్రైవింగ్ టెస్టింగ్ ట్రాక్

న్యూస్‌రీల్

కలెక్టర్‌ను కలిసిన ఎంపీ



కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎంపీ

నెల్లూరు రూరల్: కలెక్టర్ హరినారాయణన్‌ను ఆదివారం నెల్లూరులోని ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో నెల్లూరు ఎంపీ, వైఎస్సార్‌సీపీ రూరల్ నియోజకవర్గ సమన్వయకర్త ఆదాల ప్రభాకర్‌రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందజేశారు. ఎంపీ వెంట విజయ డెయిరీ చైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డి ఉన్నారు.

సమృద్ధిగా విద్యుదుత్పత్తి



ముత్తుకూరు: ముత్తుకూరు మండలం నేలటూరులోని శ్రీదామోదరం సంజీవయ్య ఏపీ జెన్‌కో ప్రాజెక్ట్‌లో వేసవి డిమాండ్‌ని దృష్టిలో ఉంచుకుని మూడు యూనిట్లలో విద్యుదుత్పత్తి చేస్తున్నారు. ఇందులో భాగంగా ఆదివారం ఒకటో యూనిట్లో 645 మెగావాట్లు, రెండో యూనిట్లో 410, మూడో యూనిట్లో 730 మెగావాట్ల విద్యుదుత్పత్తి చేస్తున్నట్లు ఇంజినీర్లు వెల్లడించారు.

సోమశిలలో 52.468 టీఎంసీలు

సోమశిల: సోమశిల జలాశయంలో ఆదివారం సాయంత్రానికి 52.468 టీఎంసీల నీరు నిల్వ ఉంది. పైతట్టు ప్రాంతాల నుంచి 363 క్యూసెక్కుల వంతున వరద ప్రవాహం వచ్చి చేరుతుంది. కాగా పెన్నార్ డెల్టాకు 250 క్యూసెక్కులు, ఉత్తరకాలువకు 303, దక్షిణకాలువకు 50, కండలేరుకు 300 క్యూసెక్కుల వంతున నీటిని విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం జలాశయంలో 96.752 మీటర్ల నీటి మట్టం నమోదైంది. సగటున 340 క్యూసెక్కుల నీరు ఆవిరి రూపంలో వృథా అవుతోంది.

క్రీడలకు ప్రాధాన్యం ఇవ్వాలి



విజేతలతో డాక్టర్ వైఎస్సార్ హెల్త్ యూనివర్సిటీ రిజిస్ట్రార్ రాధికారెడ్డి తదితరులు



ట్రోఫీ అందజేస్తున్న రాధికారెడ్డి

- డాక్టర్ వైఎస్సార్ హెల్త్ యూనివర్సిటీ రిజిస్ట్రార్ రాధికారెడ్డి
- ముగిసిన రాష్ట్రస్థాయి క్రీడా పోటీలు

నెల్లూరు(అర్బన్): కాలేజీలు చదువుతోపాటు క్రీడలకు తగిన ప్రాధాన్యం ఇవ్వాలని డాక్టర్ వైఎస్సార్ హెల్త్ యూనివర్సిటీ రిజిస్ట్రార్ రాధికారెడ్డి అన్నారు. ఈనెల 12వ తేదీ నుంచి నెల్లూరులోని నారాయణ మెడికల్ కళాశాలలో జరుగుతున్న 25వ ఇంటర్ వైద్య కాలేజీ రాష్ట్రస్థాయి క్రీడా పోటీలు ఆదివారంతో ముగిశాయి. బహుమతి ప్రదానోత్సవానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన రాధికారెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వపరంగా క్రీడలను ప్రోత్సహిస్తున్నామన్నారు. క్రీడలతో మానసిక ఉల్లాసంతోపాటు ఆరోగ్యం కలుగుతుందన్నారు. ఈ పోటీల్లో 42 కళాశాలల నుంచి 1,500 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. ఫుట్‌బాల్ పోటీల్లో విజేతగా నారాయణ మెడికల్ కళాశాల, రన్నర్స్‌గా ఆంధ్ర మెడికల్ కళాశాల, బాల్ బ్యాడ్మింటన్ విజేతగా కర్నూలు మెడికల్ కళాశాల, చెస్ విజేతగా గుంటూరు మెడికల్ కళాశాల, రన్నరప్‌గా పిన్నమనేని మెడికల్ కళాశాల, టెన్నిస్ విజేతగా జీఎస్ఎల్ మెడికల్ కళాశాల, రన్నరప్‌గా ఆంధ్ర మెడికల్ కళాశాల, బ్యాడ్మింటన్ విజేతగా విష్ణు మెడికల్ కళాశాల, రన్నర్‌గా గుంటూరు ఎన్నారై మెడికల్ కళాశాల, టేబుల్ టెన్నిస్ విజేతగా కాటూరు మెడికల్ కళాశాల, రన్నరప్‌గా ఎన్నారై మెడికల్ కళాశాల, కబడ్డీ విజేతగా నారాయణ మెడికల్ కళాశాల, రన్నర్స్‌గా జీఎస్ఎల్ మెడికల్ కళాశాల విద్యార్థులు నిలిచారు. నారాయణ మెడికల్ కళాశాల వైద్య విద్యార్థులు ఓవరాల్ చాంపియన్‌షిప్ గెలుచుకున్నారు. రాధికారెడ్డి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో నారాయణ మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ శ్రీనివాసులురెడ్డి, డెంటల్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ అజయ్ రెజినాల్డ్, డాక్టర్ వైఎస్సార్ హెల్త్ యూనివర్సిటీ స్పోర్ట్ కమిటీ చైర్మన్ డాక్టర్ త్రిమూర్తి, నారాయణ అకడమిక్ డీన్ డాక్టర్ శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

వేగంగా ప్రజా సమస్యల పరిష్కారం



మహిళకు పథకాల గురించి వివరిస్తున్న కాకాణి గోవర్ధన్‌రెడ్డి

- రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

వెంకటాచలం: సచివాలయ, వలంటీర్ల వ్యవస్థల ఏర్పాటుతో ప్రజా సమస్యలు గ్రామస్థాయిలోనే వేగంగా పరిష్కారమవుతున్నాయని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి అన్నారు. మండలంలోని గొలగమూడిలో ఆదివారం సాయంత్రం జరిగిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో మంత్రి పాల్గొన్నారు. ఆయనకు స్థానికులు ఘన స్వాగతం పలికారు. కాకాణి ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాల వల్ల జరిగిన లబ్ధిని వివరించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను తమ ప్రభుత్వం నెరవేరుస్తోందన్నారు. దీంతో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై అన్ని వర్గాలు సంతృప్తి వ్యక్తం చేస్తున్నట్లు చెప్పారు. దివంగత సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి తర్వాత ప్రజల సంక్షేమం, అభివృద్ధి గురించి పట్టించుకుంది వైఎస్ జగన్ మాత్రమేనని ప్రజలు చెబుతున్నారన్నారు. టీడీపీ హయాంలో చంద్రబాబు ప్రజలను మోసం చేశారని గుర్తు చేశారు.

అర్హులందరికీ ఇళ్ల స్థలాలు

అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ స్థలాలు పంపిణీ చేయడంతోపాటు, ఇళ్లు కట్టించి ఇస్తామని మంత్రి కాకాణి తెలిపారు. గొలగమూడిలో విలువైన ప్రభుత్వ భూములున్నాయని చెప్పారు. బడాబాబులు కోర్టులకు వెళ్లి ఇళ్ల స్థలాల పంపిణీని అడ్డుకుంటున్నారని, అన్ని సమస్యలను పరిష్కరించి అర్హులకు స్థలాలు అందజేస్తామని తెలియజేశారు. గొలగమూడి గ్రామం, వెంకయ్యస్వామి అభివృద్ధికి అన్ని విధాలా సహకరిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సుస్మిత, వైఎస్సార్‌సీపీ యువజన విభాగం రాష్ట్ర కార్యదర్శి కోడూరు ప్రదీప్‌కుమార్‌రెడ్డి, నంబూరు రాజానాయుడు, మండల వైస్ ఎంపీపీ కనుపూరు కోదండరామిరెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి మందల వెంకటశేషయ్య, వేమారెడ్డి రఘునందన్‌రెడ్డి, కొణిదెన మోహన్‌నాయుడు, విజయభాస్కర్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

సూక్ష్మ సేద్యం.. లాభదాయకం

- రైతులకు ప్రభుత్వ ప్రోత్సాహం
- ఉద్యాన పంటలకు డ్రిప్ పైపుల ఏర్పాటు
- మైక్రో ఇరిగేషన్లో పొదలకూరుకు ప్రథమ స్థానం

పొదలకూరు: సూక్ష్మ సేద్యం (మైక్రో ఇరిగేషన్).. దీని ద్వారా పంటల దిగుబడి పెరగడమే కాకుండా అన్నదాతలకు సాగు ఖర్చుల్లో ఆదాతోపాటు అదనంగా ఆదాయం సమకూరుతుంది. ఈ సేద్యాన్ని ప్రభుత్వం ప్రోత్సహిస్తోంది. ప్రతి సంవత్సరం భారీగా నిధులు కేటాయిస్తూ రాయితీపై రైతులకు పరికరాలను అందజేస్తోంది.

ప్రభుత్వ ప్రోత్సాహం ఇలా..

రైతులకు సబ్సిడీ కల్పించడం ద్వారా మైక్రో ఇరిగేషన్ సాగు విధానాన్ని పెద్ద ఎత్తున ప్రోత్సహించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ విధానంలో నీటి వృథా ఉండదు. జిల్లాలో చిన్న, సన్నకారు రైతులకు ప్రోత్సాహాలను అందిస్తోంది. డ్రిప్ పైపుల ఏర్పాటుకు రాయితీలను ప్రకటించి అందిస్తోంది. ఐదెకరాల్లోపు ఉండే రైతులకు 90 శాతం, 5 నుంచి 10 ఎకరాలున్న వారికి 70 శాతం సబ్సిడీపై పైపులను పంపిణీ చేస్తున్నారు. ఇంకా స్ప్రింక్లర్స్ ఏర్పాటు చేసుకునేందుకు ఐదెకరాల రైతులకు 55 శాతం, 5 నుంచి 12.5 ఎకరాలున్న రైతులకు 45 శాతం సబ్సిడీ ఇస్తున్నారు. రైతులు ఇష్టపూర్వకంగా సూచించిన కంపెనీల పైపులను ఏర్పాటు చేసుకునే అవకాశం కల్పించారు. ఇటీవల రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి ప్రత్యేక కార్యక్రమం ద్వారా పొదలకూరు మండలంలోని నల్లపాళెం గ్రామంలో పెద్దఎత్తున డ్రిప్ పైపుల అనుమతిపత్రాలతోపాటు, పైపులను రైతులకు అందజేశారు.



బత్తాయి మొక్కలకు ఏర్పాటు చేసిన డ్రిప్ పైపులు

లక్ష్యాలకు చేరువలో..

జిల్లాలో మైక్రో ఇరిగేషన్ ప్రాజెక్ట్ కింద 35 మండలాల్లో డ్రిప్, స్ప్రింక్లర్లను ఏర్పాటు చేసుకున్నారు. ఇందులో పొదలకూరు మండలం సూక్ష్మ సేద్యంలో జిల్లాలోనే ప్రథమ స్థానంలో ఉంది. మెట్ట భూములు అధికంగా ఉన్న మండలాల రైతులు నిమ్మ, జామ, మామిడి, బత్తాయి, కూరగాయల సాగులో డ్రిప్, స్ప్రింక్లర్లను వినియోగిస్తూ దిగుబడులను పెంపొందించుకుంటున్నారు. 2022–23 సంవత్సరానికి సంబంధించి ఇప్పటికే 2,566.14 హెక్టార్లకు సబ్సిడీపై మెటీరియల్‌ను సరఫరా చేశారు. 2023–4 సంవత్సరానికి జిల్లాకు 3,500 హెక్టార్లలో సూక్ష్మ సేద్యాన్ని ప్రోత్సహించేందుకు లక్ష్యాలను నిర్దేశించినట్టు అధికారులు వెల్లడించారు.

2022-23లో మైక్రో ఇరిగేషన్ జిల్లా లక్ష్యం :
2,900 హెక్టార్లు

డ్రిప్ ఇరిగేషన్‌కు ఎంపికైన రైతులు :
1,896 మంది

స్ప్రింక్లర్లకు ఎంపిక చేసిన రైతుల సంఖ్య :
968

దిగుబడి పెరుగుతుంది



నిమ్మతోటలకు డ్రిప్‌పైపులు ఏర్పాటు చేయడం వల్ల దిగుబడి పెరుగుతుంది. శ్రమ కూడా తక్కువ ఉంటుంది. ఎరువులు, పురుగు మందులను కూడా పైపుల ద్వారా చెట్లకు పెట్టుకునే అవకాశం ఉంది. మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి మంత్రి వల్ల డ్రిప్ పైపుల పంపిణీలో వేగం పెరిగింది.

– జీ.గోపాలయ్య, రైతు, మద్రిపల్లి.

ఎంతో ఉపయోగం



సూక్ష్మ సేద్యం కింద డ్రిప్, స్ప్రింక్లర్ల ఏర్పాటుతో తోటలకు నీరు సక్రమంగా అందుతుంది. ప్రధానంగా నిమ్మ, కూరగాయల పంటలకు ఎంతగానో ఉపయోగం ఉంది. మైక్రో ఇరిగేషన్ ప్రాజెక్ట్ రాయితీలను పునరుద్ధరించడం మంచి పరిణామం.

– సీహెచ్ రమేష్, రైతు, నావూరుపల్లి

లక్ష్యాలను అధిగమిస్తాం



జిల్లా మైక్రో ఇరిగేషన్ ప్రాజెక్ట్ లక్ష్యాలను అధిగమిస్తాం. ఇప్పటికే 90 శాతం సాధించడం జరిగింది. రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా డ్రిప్, స్ప్రింక్లర్లను అందజేయడం జరుగుతుంది. ప్రభుత్వం సూక్ష్మ సేద్యాన్ని ప్రోత్సహిస్తోంది.

– శ్రీనివాసులు, పీడీ, జిల్లా మైక్రో ఇరిగేషన్ ప్రాజెక్ట్

కావలిలో 165 సవర్ల బంగారం చోరీ

కావలి: పట్టణంలోని కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్లు ఉండే బృందావనం కాలనీలో వస్త్ర వ్యాపారి చెక్కా సురేష్‌బాబు అలియాస్ సూరి ఇంట్లో ఆదివారం తెల్లవారుజామున భారీ చోరీ జరిగింది. పోలీసుల కథనం మేరకు.. సూరి మరో వ్యక్తి వ్యాపార పనుల్లో భాగంగా ఇతర ప్రాంతాలకు వెళ్లి శనివారం అర్ధరాత్రి తమ ఇళ్లకు చేరుకున్నారు. కాగా సూరి దంపతులు తమ ఇంట్లోని ఒక బెడ్‌రూంలో, వారి కుమారుడు మిద్దెపై నిద్రపోయారు. ఆదివారం ఉదయం కుటుంబసభ్యులు నిద్ర లేచి చూసేసరికి ఒక బెడ్‌రూం తలుపులు తీసి ఉంది. అలాగే ఇంటి ప్రధాన తలుపులు కూడా తీసి ఉన్నాయి. ఈ క్రమంలో 165 సవర్ల బంగారు ఆభరణాలు, రూ.1.5 లక్షల నగదు చోరీ జరినట్లు గుర్తించారు. దొంగలు గడ్డపార, ఇనుప ఆయుధాలతో తాళాలు పగులగొట్టారు. ఒక బెడ్‌రూంలో సూరి దంపతులు నిద్రిస్తుండడాన్ని గుర్తించి పక్కనే ఉన్న మరో బెడ్‌రూంలోకి వెళ్లారు. బీరువా తీసి అందులో ఉన్న రూ.1.5 లక్షల నగదు తీసుకున్నారు. ఇనుప పెట్టె తాళాలు తీసుకుని దానిని తెరిచారు. అందులో ఉన్న వెండి వస్తువులు, చిన్న చిన్న బంగారు వస్తువులను వదిలేసి, తూకం ఎక్కువ ఉండే బంగారు ఆభరణాలు తీసుకున్నారు. అనంతరం సూరితోపాటు వెళ్లిన మరో వ్యాపారి ఇంటికి దొంగలు వెళ్లి ప్రధాన ద్వారం తలుపు తీసే ప్రయత్నం చేశారు. ఏమైందో కానీ దొంగలు గడ్డపార, చిన్న ఇనుప ఆయుధాలను అక్కడే వదిలేసి వెళ్లిపోయారు. నెల్లూరు నుంచి వచ్చిన డాగ్ స్క్వాడ్ చోరీ జరిగిన ఇంటి నుంచి బయటికి వచ్చి ప్రహరీ వరకు వెళ్లింది. క్లూస్ టీం ఘటనా స్థలంలో వేలిముద్రలు సేకరించింది. ఎస్పీ తిరుమలేశ్వరరెడ్డి కావలికి చేరుకుని చోరీ జరిగిన ఇంటిని పరిశీలించి బాధితులు, స్థానిక పోలీస్ అధికారులతో మాట్లాడారు. అలాగే కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి బాధిత కుటుంబాన్ని పరామర్శించారు.



చోరీ జరిగిన ఇంటిని పరిశీలిస్తున్న ఎస్పీ తిరుమలేశ్వరరెడ్డి

విద్యుత్ కోతల్లేవ్

గతేడాది కన్నా ఈ ఏడాది వేసవి ఉష్ణోగ్రతలు అధికంగా ఉండే అవకాశం ఉందని వాతావరణశాఖ అధికారులు ప్రకటించారు. అందుకు తగినట్లుగానే జిల్లాలో భానుడు రోజురోజుకూ తన ప్రతాపాన్ని చూపుతున్నాడు. మార్చి నుంచి వేడి గాలులు ప్రారంభమయ్యాయి. ఏప్రిల్‌లో పగటి ఉష్ణోగ్రతలు పెరిగి ఉక్కపోతతో ఇళ్లు, కార్యాలయాల్లో ఏసీలు, ఫ్యాన్లు, ఎయిర్‌కూలర్లను ఎక్కువగా వినియోగిస్తున్నారు. విద్యుత్ వినియోగం పెరిగినప్పటికీ కోతలు లేకుండా సరఫరా చేసేలా ఏపీ ఎస్పీడీసీఎల్ చర్యలు తీసుకుంది.

- జిల్లాలో రోజురోజుకూ పెరుగుతున్న విద్యుత్ డిమాండ్
- ఏప్రిల్‌లో 14 మిలియన్ యూనిట్లకు పైగా వినియోగం
- డిమాండ్ ఎంత పెరిగినా కోతలు లేకుండా విద్యుత్ సరఫరా



ఏపీఎస్పీడీసీఎల్ జిల్లా ప్రధాన పరిపాలనా కేంద్ర భవనం



విద్యుత్ సబ్‌స్టేషన్

నెల్లూరు(వీఆర్సీసెంటర్): ఈ ఏడాది జనవరి, ఫిబ్రవరి నెలలతో పోలిస్తే మార్చి, ఏప్రిల్ నెలల్లో విద్యుత్ డిమాండ్ క్రమేపీ పెరుగుతోంది. ఉమ్మడి జిల్లాలో ఏప్రిల్‌లో అధికంగా రోజుకు 14 ఎంయూ(మిలియన్ యూనిట్ల) విద్యుత్ వినియోగం అవుతోందంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. ఒక మిలియన్ విద్యుత్ యూనిట్ అంటే 10 లక్షల యూనిట్లకు సమానం. ఏప్రిల్, మే నెలల్లో ఎండలు మరింత తీవ్రమయ్యే అవకాశం ఉన్న నేపథ్యంలో మరో రెండు మిలియన్ యూనిట్ల విద్యుత్ వినియోగం పెరిగే అవకాశం ఉందని విద్యుత్‌శాఖ అధికారులు అంచనా వేస్తున్నారు. అయితే విద్యుత్ వినియోగం ఎంత పెరిగినా, ఎంత డిమాండ్ ఏర్పడినా ఎలాంటి అంతరాయాలు లేకుండా వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్‌ను సరఫరా చేస్తున్నారు.

కోటాకు మించి వినియోగం

ఉమ్మడి జిల్లాలో మార్చి నెలకు 384.183 మిలియన్ యూనిట్లను కోటాగా ఏపీఎస్పీడీసీఎల్ కేటాయించింది. ఈ లెక్కన జిల్లాలో రోజుకు 12.393 మిలియన్ యూనిట్ల విద్యుత్ వినియోగం కావాలి. కానీ ఈ కోటాను మించి 13.487 మిలియన్ యూనిట్ల వినియోగం జరుగుతోంది. అంటే ఇచ్చిన కోటా కన్నా అదనంగా 1.094 మిలియన్ యూనిట్ల విద్యుత్‌ను ప్రతి రోజూ వినియోగిస్తున్నారు. సాయంత్రం 6 నుంచి రాత్రి 11 గంటల మధ్య ఎక్కువ విద్యుత్ లోడ్ పడుతోంది. మే నెలలో రోజువారీ విద్యుత్ వినియోగం 18 మిలియన్ యూనిట్లకు చేరే అవకాశం ఉందని విద్యుత్ అధికారులు అంచనా వేస్తున్నారు. జనవరి, ఫిబ్రవరి నెలల్లో ఎండలు ఒక మోస్తరుగా ఉన్నా రాత్రి సమయంలో చలిగా ఉండడంతో జనవరిలో రోజువారీగా 11 మిలియన్ యూనిట్లు, ఫిబ్రవరి నెలలో 12 మిలియన్ యూనిట్లను వినియోగించారు. మార్చి నెలలో వచ్చిన వాతావరణ మార్పుల కారణంగా ఉష్ణోగ్రతలు పెరిగి ఉక్కపోతకు తట్టుకోలేని విద్యుత్ వినియోగదారులు ఇళ్లు, కార్యాలయాల్లో ఏసీలు, ఎయిర్‌కూలర్లు, ఫ్యాన్లను ఎక్కువగా వినియోగించడం మొదలుపెట్టారు. దీంతో రోజువారీగా విద్యుత్ వినియోగం పెరిగింది. జిల్లాలో పరిశ్రమలు, ఆహార పంటలు, ఉద్యాన పంటలతో బోర్ల వాడకం అధికంగా ఉండడంతో విద్యుత్ వినియోగం ఎక్కువగానే ఉంటోంది.

ఉమ్మడి జిల్లాలో విద్యుత్ సర్వీసులు (కేటగిరీ వారీగా..)		
గృహ సర్వీసులు	-	9,06,026
వాణిజ్యం	-	99,586
వ్యవసాయం	-	1,95,884
పరిశ్రమలు	-	4,216
వీధిదీపాలు, వాటర్ వర్క్	-	25,433
హెచ్‌టీ సర్వీసులు	-	735
ఆక్వా సర్వీసులు	-	33,682
మొత్తం	-	12,65,562

ఏప్రిల్ నెలలో విద్యుత్ వాడకం

ఈ ఏడాది ఏప్రిల్ ఒకటో తేదీన 11.913 మిలియన్ యూనిట్ల విద్యుత్‌ను జిల్లాలోని వినియోగదారులు ఉపయోగించారు. అలాగే ఏప్రిల్ 2వ తేదీకి 23.508 మిలియన్ యూనిట్లను, 3వ తేదీకి 35.799, 4వ తేదీకి 48.442, 5వ తేదీకి 61.548, 6వ తేదీకి 74.925, 7వ తేదీకి 88.236, 8వ తేదీకి 101.202, 9వ తేదీకి 113.746, 10వ తేదీకి 126.877, 11వ తేదీకి 140.287, 12వ తేదీకి 153.774, 13వ తేదీకి 167.650, 14వ తేదీకి 181.784, 15వ తేదీకి 196.053 మిలియన్ యూనిట్ల విద్యుత్‌ను వినియోగదారులు వినియోగించారు. అయినప్పటికీ విద్యుత్ సంస్థ వినియోగదారులకు ఎలాంటి అంతరాయం లేకుండా నాణ్యమైన విద్యుత్‌ను సరఫరా చేస్తోంది.

డిమాండ్ ఎంత పెరిగినా కోతలు ఉండవు



ఉమ్మడి జిల్లాలో విద్యుత్ వాడకం పెరిగింది. ఫిబ్రవరి నుంచి పెరిగిన డిమాండ్‌కు అనుగుణంగా విద్యుత్‌ను సరఫరా చేస్తున్నాం. ఏపీఎస్పీడీసీఎల్ అధికారులు జిల్లాకు ఇచ్చిన నెలవారీ కోటా 12.393 మిలియన్ యూనిట్లు కాగా 13.487 మిలియన్ యూనిట్ల విద్యుత్ వినియోగం జరుగుతోంది. అయినప్పటికీ ఎలాంటి అంతరాయాలు లేకుండా నాణ్యమైన విద్యుత్ సరఫరా చేసేందుకు సిద్ధంగా ఉన్నాం.

– వెంకటసుబ్బయ్య, ఎస్ఈ, ఏపీఎస్పీడీసీఎల్, నెల్లూరు జిల్లా సర్కిల్

కోతలు లేని విద్యుత్ సరఫరా



గతంలో ఎండాకాలం వచ్చిందంటే భయం వేసేది. రోజుకు 4 నుంచి 6 గంటల వరకు కరెంట్ కోతలు ఉండేవి. అప్రకటిత కోతలు విధించేవారు. ప్రస్తుతం ఆ పరిస్థితి లేదు. సీఎంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చాక కరెంట్ కోతలు లేవు.

– అల్లంపాటి మురళీకృష్ణారెడ్డి, విద్యుత్ వినియోగదారుడు, నెల్లూరు

తండ్రి ఘాట్ వద్ద మంత్రి కాకాణి భావోద్వేగం



రమణారెడ్డి ఘాట్ వద్ద నివాళులర్పిస్తున్న మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

పొదలకూరు: పొదలకూరు ప్రాంతంలో పెద్దాయనగా పిలుచుకునే దివంగత మాజీ సమితి అధ్యక్షుడు, రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి తండ్రి కాకాణి రమణారెడ్డి ద్వితీయ వర్ధంతి సందర్భంగా ఆదివారం తోడేరులోని ఆయన ఘాట్ వద్ద మంత్రి భావోద్వేగానికి గురయ్యారు. కాకాణి సతీమణి, తల్లి, కుమార్తె, అల్లుళ్లు, అక్కలు, బావలతో ఘాట్ వద్దకు చేరుకుని ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఇంటి వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. 2021 మే 7న కాకాణి రమణారెడ్డి మృతిచెందారు. అయితే తిథి, నక్షత్రం ప్రకారం ఆదివారం వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. మే 7న తిరిగి పెద్దఎత్తున అభిమానుల సమక్షంలో ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించి ఘన నివాళులు అర్పించనున్నారు. మంత్రి వెంట వైస్ ఎంపీపీ వేణుంబాక చంద్రశేఖర్‌రెడ్డి, సొసైటీ చైర్మన్ గోగిరెడ్డి గోపాల్‌రెడ్డి, నాయకులు వళ్లూరు గోపాల్‌రెడ్డి, బచ్చల సురేష్‌కుమార్‌రెడ్డి, వేణుంబాక సుమంత్‌రెడ్డి, ఏనుగు శశిధర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

లారీ, బైక్ ఢీ

- ఒకరికి తీవ్రగాయాలు



లారీ కింద ఇరుక్కుపోయిన బైక్

చిల్లకూరు: మండలంలో లారీ, బైక్ ఢీకొని ఒకరికి తీవ్ర గాయాలైన ఘటన ఆదివారం చోటుచేసుకుంది. స్థానికుల కథనం మేరకు గూడూరుకు చెందిన పవన్ బైక్‌పై చింతవరానికి బయలుదేరాడు. మార్గమధ్యంలో నాంచారమ్మపేట సమీపంలో ఎదురుగా వస్తున్న లారీ బైక్‌ను ఢీకొంది. దీంతో పవన్‌కు తీవ్రగాయాలయ్యాయి. చికిత్సనిమిత్తం ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. దీనిపై పోలీసులు విచారణ చేపట్టారు.

క్లుప్తంగా

సూర్యప్రభ వాహనంపై శ్రీమహావిష్ణువు



సూర్యప్రభ వాహనంపై కొలువుదీరిన స్వామివారు

సైదాపురం: మండలంలోని వైకుంఠపురంలో ఉన్న శ్రీమహావిష్ణువు ఆలయంలో జరుగుతున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం స్వామివారు సూర్య ప్రభవాహనంపై విహరించారు. ఉదయం స్వామివారికి విశేషాలంకరణ చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం తిరుచ్చి ఉత్సవం జరిపారు.

నేడు రథోత్సవం

శ్రీమహావిష్ణువు బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం రథోత్సవం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

కోనలో చలువ పందిళ్లు



ఆలయం చుట్టూ ఏర్పాటు చేసిన పందిళ్లు

రాపూరు: పెంచలకోనలోని పెనుశిల లక్ష్మీనరసింహస్వామి ఆలయ ప్రాంగణంలో చలువ పందిళ్లను ఏర్పాటు చేశారు. ఆలయం చుట్టూ భక్తులు ప్రదక్షిణ చేయడానికి ఇబ్బంది లేకుండా ఈ ఏర్పాట్లు చేశారు. మే 1వ తేదీ నుంచి శ్రీవారి బ్రహ్మోత్సవాలు ప్రారంభం కానున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు.

బాలుడిని అదుపులోకి తీసుకున్న పోలీసులు

లింగసముద్రం: మండలంలోని అన్నెబోయినపల్లె ఎస్సీకాలనీలో బాలికపై లైంగికదాడి యత్నం కేసులో బాలుడిని అరెస్ట్ చేసినట్లు ఎస్సై ఆవుల వెంకటేశ్వర్లు ఆదివారం తెలిపారు. కందుకూరు డీఎస్పీ కండే శ్రీనివాసులు ఆదేశాల మేరకు బాలుడిని ఒంగోలు జిల్లా కోర్టులో జువైనల్ జస్టిస్ బోర్డు ఎదుట హాజరుపరచగా తిరుపతిలో అబ్జర్వేషన్ హోంకు తరలించాలని జడ్జి ఆదేశించడంతో అక్కడకు తరలించినట్లు ఎస్సై తెలిపారు.

పొదలకూరు నిమ్మధరలు (కిలో)

పెద్దవి:	రూ.77
సన్నవి:	రూ.50
పండ్లు:	రూ.30



నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు

బ్రాయిలర్ (లైవ్) :	120
లేయర్ (లైవ్) :	75
బ్రాయిలర్ చికెన్ :	210
బ్రాయిలర్ స్కిన్‌లెస్ :	234
లేయర్ చికెన్ :	128



అర్హులందరికీ సంక్షేమ పథకాలు

- కోవూరు ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి



లబ్ధిదారుకు ఇళ్ల పట్టా అందజేస్తున్న ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి

బుచ్చిరెడ్డిపాళెం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కులమతాలు, రాజకీయ పార్టీలకు అతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్నారని కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి తెలిపారు. ఆదివారం మండలంలోని పంచేడు ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ఆవరణలో 163 మంది లబ్ధిదారులకు ఎమ్మెల్యే ఇళ్ల పట్టాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఇప్పటివరకు దాదాపు రూ.2 లక్షల కోట్లతో సంక్షేమ పథకాలను అమలు చేసిందని తెలిపారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా పదవి చేపట్టిన వెంటనే వైఎస్సార్‌సీపీకి ఓటు వేయని వారికి సైతం ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందాలని తమకు చెప్పారని, దీనిని బట్టి చూస్తే ప్రజలపై ముఖ్యమంత్రికి ఎంత ప్రేమ ఉందో అర్థమవుతుందని తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో ఇళ్ల స్థలాలు కావాలంటే ప్రజలు నిత్యం ప్రభుత్వ కార్యాలయాలు చుట్టూ తిరగాల్సివచ్చేదని, అయితే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే జగనన్న లేఅవుట్లను ఏర్పాటు చేసి అర్హులైన లబ్ధిదారులకు ఇళ్ల స్థలాలు, పట్టాలు అందజేసి ఇళ్లు నిర్మించేలా చర్యలు తీసుకుంటోందని తెలిపారు. జిల్లాలో 1,477 జగనన్న లేఅవుట్లు ఏర్పాటు చేసి 1.74 లక్షల మందికి ఇళ్ల పట్టాలను ఇచ్చామని, కోవూరు నియోజకవర్గంలో 80 లేఅవుట్లు వేసి 11,203 మందికి ఇళ్ల పట్టాలను అందజేశామని తెలిపారు.

ప్రతిపక్షాలు దుష్ప్రచారం

రాష్ట్ర ప్రభుత్వం ప్రజా సంక్షేమానికి కట్టుబడి ఉంటే ప్రతిపక్షాలైన టీడీపీ, జనసేన పార్టీ దుష్ప్రచారం చేస్తున్నాయని ఎమ్మెల్యే ఆవేదన చెందారు. అవినీతికి తావులేకుండా సంక్షేమ పథకాలకు సంబంధించి నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లో రాష్ట్ర ప్రభుత్వం నగదు జమ చేస్తోందని తెలిపారు. టీడీపీ, జనసేన నేతలు అర్థం లేని విమర్శలు చేస్తూ ప్రజలను తప్పుదోవ పట్టించేందుకు ప్రయత్నిస్తున్నారని, అయితే వారికి బుద్ధి చెప్పేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో అమలవుతున్న సంక్షేమ పథకాలను పక్క రాష్ట్రాలు కూడా అమలు చేసేలా చర్యలు తీసుకుంటున్నాయని తెలిపారు. ప్రతిపక్షాలు ఎన్ని విమర్శలు చేసినా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శాశ్వత ముఖ్యమంత్రిగా కొనసాగుతారని ధీమా వ్యక్తం చేశారు. తనతోపాటు సూరా శ్రీనివాసులురెడ్డిపై సోషల్ మీడియాలో అసత్య ప్రచారాలు వచ్చాయని, వాటిని నమ్మవద్దని తెలిపారు. తాను ఎప్పటికీ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వెంటే ఉంటానని స్పష్టం చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రైతు విభాగం జిల్లా అధ్యక్షుడు సూరా శ్రీనివాసులురెడ్డి, జెడ్పీటీసీ సభ్యులు సూరా ప్రదీప, సర్పంచ్ సూరా విజయలక్ష్మి, వైస్ ఎంపీపీ నాగిరెడ్డి కీర్తన, కౌన్సిలర్లు అందె ప్రత్యూష, శివకుమార్‌రెడ్డి, మల్లారెడ్డి, తహసీల్దార్ వీరి సుధీర్, ఎంపీడీఓ నరసింహారావు, ఏపీఎం లలిత, నాయకులు ద్వారకానాథ్‌రెడ్డి, నాగసుబ్బారెడ్డి, మహేష్, జయరామిరెడ్డి, ప్రసాద్, మురళీ, వెంకయ్య తదితరులు పాల్గొన్నారు.

సామాజిక సేవలో సింహపురి రెడ్డి సంక్షేమ సంఘం



ఫల సరుకులు అందజేస్తున్న డాక్టర్ జనార్దనరెడ్డి

గూడూరు: సామాజిక సేవా కార్యక్రమాల్లో సింహపురి రెడ్డి సంక్షేమ సంఘం ముందుందని ప్రముఖ వైద్యుడు జనార్దనరెడ్డి పేర్కొన్నారు. స్థానిక డీఎస్ఆర్ కమ్యూనిటీ హాల్లో ఆ సంఘం ఆధ్వర్యంలో డాక్టర్ సీఆర్ రెడ్డి దాతృత్వంతో ఆదివారం పేదలకు ఫల సరుకులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంఘం ఆధ్వర్యంలో విద్య, వైద్యానికి తమవంతు చేయూతనందిస్తున్నామన్నారు. ఈ క్రమంలోనే ప్రతిభ కలిగిన విద్యార్థులకు ఉన్నత చదువుల నిమిత్తం సహాయ సహకారాలు అందజేసినట్లు తెలిపారు. అనంతరం డాక్టర్ పేట వెంకటకృష్ణారెడ్డి మాట్లాడుతూ ఈ కార్యక్రమానికి దాతృత్వం వహిస్తున్న డాక్టర్లు జనార్దనరెడ్డి, రోహిణిలకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ధనంజయరెడ్డి, సిద్దారెడ్డి, ప్రజేంద్రరెడ్డి, నిరంజన్‌రెడ్డి, హరినాథ్‌రెడ్డి, హరిప్రసాద్‌రెడ్డి, రాధాకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఒడ్డుకు చేరిన బోట్లు



కొండూరుపాళెం వద్ద ఒడ్డున నిలిపిన పడవలు

వాకాడు: ఇప్పటివరకు సముద్రంపై వేటాడిన మరబోట్లు ఒడ్డుకు చేరాయి. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఏప్రిల్ 15 నుంచి జూన్ 16వ తేదీ వరకు 61 రోజులపాటు వేట విరామం ప్రకటించడంతో అందుకు కట్టుబడిన మత్స్యకారులు వేటను నిలుపుదల చేసి బోట్లకు ఒడ్డున లంగర్ వేశారు. మొన్నటి వరకూ కొనుగోలుదారులు, జాలర్లతో సందడితో కళకళలాడిన సముద్ర తీరం ఒక్కసారిగా బోసిపోయింది.

పుచ్చదబ్బ దొరికిందోచ్



తాటిముంజలు భలే చలవ



రోజురోజుకూ ఎండలు తీవ్రమవుతున్న క్రమంలో చలవ చేసే తాటిముంజలు, పుచ్చకాయలు తదితర ఆహార పదార్థాలను తినేందుకు నగరవాసులు ప్రాధాన్యం ఇస్తున్నారు. తాటికాయలు, పుచ్చకాయలు ఎక్కడ కనిపించినా కొనుగోలు చేసేందుకు మక్కువ చూపుతున్నారు. అయితే కోతులు ఇతర జంతువులు సైతం వేసవిలో ఆహారం కోసం తిప్పలు పడుతున్నాయి. – సాక్షి ఫొటోగ్రాఫర్, నెల్లూరు